క్లుప్తంగా

నేడు హుండీ లెక్కింపు

పాలకుర్తి టౌన్: శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు హుండీ లెక్కింపు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ నండూరి రజనీకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లెక్కింపులో ఆలయ చైర్మన్, ధర్మకర్తలు, అధికారులు పాల్గొనాలని ఈఓ కోరారు.

హుండీ బహూకరణ



పాలకుర్తి: బమ్మెరలోని శ్రీ ఆలేటి ఎల్లమ్మ గుడికి రూ.11 వేల విలువైన హుండీని మంగళవారం హైదరాబాద్‌కు చెందిన బోడ సతీష్‌కుమార్ బహూకరించినట్లు సర్పంచ్ జలగం నాగభూషణం తెలిపారు. కార్యక్రమంలో బమ్మెర గ్రామ వార్డు సభ్యులు కుంట శ్రీనివాస్, బానోత్ రమేష్‌నాయక్, మాడరాజు యాకయ్య, గుండె రవి, మల్లయ్య పాల్గొన్నారు.

పరామర్శ

కొడకండ్ల: మండల రైతుబంధు సమితి కన్వీనర్ ధీకొండ వెంకటేశ్వర్‌రావును మంగళవారం ప్రజాప్రతినిధులు, నాయకులు పరామర్శించారు. వెంకటేశ్వర్‌రావు సోమవారం వాకింగ్‌కు వెళ్లిన క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో గాయాలై అస్పత్రిలో చికిత్స పొంది మొండ్రాయిలో తన నివాసంలో విశ్రాంతి తీసుకొంటున్నారు. కాగా, మార్కెట్ చైర్మన్ పేరం రాము, ఈజీఎస్ రాష్ట్ర డైరెక్టర్ అందె యాకయ్య, జీసీసీ మాజీ చైర్మన్ అభిమన్‌గాంధీనాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సిందె రామోజీ, యూత్ అధ్యక్షుడు సతీష్‌గౌడ్ తదితరులు పరామర్శించారు.

ఎమ్మెల్యే రాజయ్యను గ్రామాల్లో తిరగనివ్వొద్దు



మాట్లాడుతున్న వినోద్

స్టేషన్‌ఘన్‌పూర్: అధికార బీఆర్ఎస్ పార్టీకి చెందిన దళిత మహిళా సర్పంచ్‌ను లైంగికంగా వేధించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్యను ప్రజలు గ్రామాల్లో తిరగనియ్యొద్దని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి చేపూరి వినోద్ అన్నారు. మండలంలోని ఛాగల్లులో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఎమ్మెల్యే రాజయ్య తీరుపై మండిపడ్డారు. ధర్మసాగర్ మండలం జానకీపురం సర్పంచ్ నవ్య ఎమ్మెల్యేపై చేసిన ఆరోపణలు అందరికీ తెలిసిందే అన్నారు. అయితే ఎమ్మెల్యే సర్పంచ్ నవ్య ఇంటికి వెళ్లి గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానని మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ఈ సమావేశంలో నాయకులు కుందూరు వెంకట్‌రెడ్డి, ఎల్లయ్య, కిషన్‌రెడ్డి, స్వరూప, ఉపేంద్ర, ఉత్తరమ్మ, ఎలిషా, రజిత, శ్రీలత, కొమురయ్య, రామస్వామి, సత్తయ్య పాల్గొన్నారు.

యువతకు పెద్దపీట

స్టేషన్‌ఘన్‌పూర్: జనసేన పార్టీలో అధినేత పవన్‌కల్యాణ్ యువతకు పెద్దపీట వేస్తున్నారని పార్టీ రాష్ట్ర నాయకులు గాదె పృథ్వీ అన్నారు. జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం డివిజన్ కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. జీరో బడ్జెట్ పాలిటిక్స్ అనే నినాదంతో సామాన్య యువతకు పార్టీలో ప్రాధాన్యత ఇస్తున్నారని, యువత రాజకీయాల్లో కీలకంగా ఉండాలనేది పార్టీ అధినేత ఆకాంక్ష అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రజాక్, పవన్, విజయ్, ప్రశాంత్, సాయి, వినయ్, బన్నీ, రాజేష్, రాజుతోపాటు తదితరులు ఉన్నారు.

40 కేజీల గంజాయి స్వాధీనం

జనగామ రూరల్: పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌లో అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న మహ్మద్ సోహెల్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి అతడి నుంచి 40 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు మంగళవారం ఎక్సైజ్ సీఐ ప్రభావతి తెలిపారు. అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు సీహెచ్ జనార్దన్, కె.రాధిక, సిబ్బంది ఫయాజ్, ఖలీల్, రాములు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం..

చిల్పూరు: మండలంలోని మల్కాపూర్‌లో మంగళవారం టాటాఏస్ వాహనంలో 16 బ్యాగుల్లో అక్రమంగా తరలిస్తున్న 8 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా పుట్టగూడెంకు చెందిన మాలోత్ రాందాసుపై కేసునమోదు చేసినట్లు ఆయన చెప్పారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత..

చిన్నపెండ్యాల గ్రామ శివారులో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు. ఇల్లందుల రాజుపై కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్ తరలించినట్లు పేర్కొన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి



డబుల్ బెడ్రూం ఇళ్ల పట్టాలు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

నర్మెట: రాష్ట్ర ప్రభుత్వం పేదల అభ్యున్నతే ధ్యేయంగా పని చేస్తుందని, వారి సంక్షేమార్థం సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని వెల్దండలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల పట్టాలను, ఇంటి తాళాలను 50 మంది లబ్ధిదారులకు హన్మంతాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో దాదాపు రూ.2కోట్ల 50 లక్షల వ్యయంతో నిర్మించిన ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్నామని, అలాగే రూ. 2 కోట్ల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లుకు నిధులను కూడా మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో సొంత భూమి ఉండి ఇంటిని నిర్మించుకునే వారికి రూ.3 లక్షలను లబ్ధిదారులకు ప్రభుత్వం అందించబోతుందని ఇళ్లు లేని వారు నిరాశ చెందకూడదన్నారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా మళ్లీ అధికారంలోకి రాబోతున్నామని తెలిపారు. ఎంపీపీ తేజావత్ గోవర్ధన్ నాయక్, జెడ్పీటీసీ మాలోత్ శ్రీనివాస్ నాయక్, సర్పంచ్ నర్ర వెంకట్‌రమణారెడ్డి, జెడ్పీ కోఆప్షన్ ఎండీ. గౌస్, మండల అధ్యక్షులు చింతకింది సురేష్, తహసీల్దార్ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ మంకెన ఆగిరెడ్డి, ఆర్ఐలు సాయిబాబ, వంశీ, సర్పంచ్‌లు శంకర్‌నాయక్, శ్రీనివాస్‌నాయక్, నాయకులు వంగ రవి, రవీందర్, రమేష్, రాజు, మల్లేష్, కిరణ్, నరేష్, జీవన్, నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌తోనే సంక్షేమ పాలన'



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

జనగామ రూరల్: కాంగ్రెస్ పార్టీతోనే ప్రజలకు సంక్షేమ పాలన సాధ్యమతుందని జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెంచారపు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని 23వ వార్డులో పట్టణ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గడపగడపకు రాహుల్ గాంధీ సందేశ యాత్ర కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజర్వాయర్లను నిర్మించి కాల్వల ద్వారా నీరుతీసుకొచ్చి జనగామను సస్యశ్యామలం చేసింది కాంగ్రెస్ పార్టీయే అని ప్రజలకు తెలుసని చెప్పారు. పొన్నాల కృషితో జనగామ అభివృద్ధి చెందిందని, నేడు బీఆర్ఎస్ ఎక్కడ కాల్వలు నిర్మించిందో చెప్పాలని అన్నారు. నాయకులు లింగాజీ, ఉడుత రవి, మల్లేష్, దిలీప్ రెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనే లక్ష్యం



టీబీ నివారణపై ప్రతిజ్ఞ చేయిస్తున్న వసంత

తరిగొప్పుల: జిల్లా ఆరోగ్యశాఖ అదేశాల మేరకు మండలకేంద్రంలో ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం టీబీ నిక్షయ్ దివస్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం వసంతరాణి మాట్లాడుతూ క్షయను నిర్మూలించాలనే లక్ష్యంతో ప్రతినెలా 15వ తేదీన నిక్షయ్ దివస్ నిర్వస్తున్నామని, తద్వారా ప్రజలకు క్షయ వ్యాధిపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఏఎన్ఎం అనిత, అంగన్‌వాడీ టీచర్ సంతోష, అంజమ్మ, ఆశవర్కర్లు శారద పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



శిబిరాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్



కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

జనగామ రూరల్: 'కంటి వెలుగు' కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. జిల్లా కేంద్రం 16వ వార్డులో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పట్టణ పరిధిలో కంటి పరీక్షలు చేయించుకోని వారిని గుర్తించి సమాచారం అందించి శిబిరానికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. క్యాంపునకు వచ్చిన ప్రజలకు ఎండ తగుల కుండా టెంట్లు, కుర్చీలు, తాగునీరు తదితర సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ రజిత ఉన్నారు.

పల్లెప్రజలకు ఉచిత కంటి వెలుగులు

దేవరుప్పుల: పల్లెప్రజలకు తెలంగాణ ప్రభుత్వం ఉచితంగా కంటివెలుగులు ప్రసాదించడం హర్షణీయమని సర్పంచ్ బానోత్ రాజన్న అన్నారు. మంగళవారం నల్లకుంట తండాలో కంటివెలుగు–3 క్యాంపును ఆయన ప్రారంభించారు. వారం రోజుల పాటు కొనసాగే వైద్యశిబిరాన్ని తండావాసులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉపసర్పంచ్ భిక్షపతి, క్యాంపు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఏల అనిల్ కుమార్, ఆప్తాల్మిక్ ఆఫీసర్ బొబ్బిలి, పంచాయతీ కార్యదర్శి అజయ్, క్యాంపు కోఆర్డినేటర్ భాగ్య, బద్రి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఎల్లమ్మ బోనాలు



లింగాలఘణపురం: మండల కేంద్రంలోని ఎల్లమ్మకు దళిత సామాజిక వర్గానికి చెందిన వారంతా మంగళవారం వైభవంగా బోనాలతో నైవేద్యం సమర్పించారు. గత ఏడాది నూతన ఆలయాన్ని నిర్మించి ఎల్లమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. రెండోసారి కూడా బైండ్ల పూజారులతో ఎల్లమ్మ పండుగను పట్నం వేసి కల్యాణోత్సవం జరిపారు. డోలువాయిద్యాలతో నృత్యాలు చేస్తూ యువకులు ఉత్సాహంగా పాల్గొనగా మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. కుల పెద్దలు రాగల్ల సాయిలు, గట్టగల్ల మహేందర్, కమిటీ సభ్యులు భీమయ్య, పెదరాజయ్య ఉన్నారు.

ఆర్థికసాయం

జనగామ రూరల్: అడవికేశాపూర్ గ్రామానికి చెందిన గూడూరు రాజు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. కాగా, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని మంగళవారం ఫోన్‌లో పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. బాధిత కుటుంబానికి రూ. 20లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కెపాసిటర్లతో మోటార్లకు రక్ష



కెపాసిటర్లు తీసుకున్న రైతులతో నర్సింహారెడ్డి

బచ్చన్నపేట: వ్యవసాయ బావుల వద్ద మోటార్లకు కెపాసిటర్లను బిగించుకొంటే అవి మోటార్లకు శ్రీరామరక్షగా పని చేస్తాయని ట్రాన్స్‌కో కట్కూర్ లైన్‌మన్ నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని వంగ సుదర్శన్‌రెడ్డినగర్ వద్ద వ్యవసాయ మోటార్లకు బీఆర్ఎస్ నాయకులు, దాత చల్ల శ్రీనివాస్‌రెడ్డి అందించిన కెపాసిటర్లను బిగించి మాట్లాడారు. కెపాసిటర్లు ఉంటే మోటార్ వేడి కాకుండా చూస్తుందన్నారు. రైతులు కళ్యాణం రవి, గొడుగు నర్సింహులు, కనుకయ్య, మల్లేశం, నర్సింహులు, బాబు, రంగయ్య పాల్గొన్నారు.

అభినందనీయం



మాట్లాడుతున్న ఏసీపీ రఘుచందర్

చిల్పూరు: పేదల ఆరోగ్య పరిరక్షణ కోసం ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్ ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ రఘుచందర్ అన్నారు. మండలంలోని నష్కల్‌లో మంగళవారం బాపిస్ట్ చర్చి 26వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని చర్చి ఆవరణలో వ్యవస్థాపకుడు బీఎస్ డేవిడ్, బొజ్జ క్రిష్టఫర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడారు. గ్రామాల్లో పేదల ఆరోగ్య సమస్యలు గుర్తించి సేవలు అందించేందుకు సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. శిబిరంలో 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి ఉచితంగా మందులు అందజేశారు. హ్యాండ్ ఆఫ్ హోప్ నిర్వాహకులు డాక్టర్ కెనడీ జవహర్, ఎంపీటీసీ పాశం శిరీషసురేష్, సర్పంచ్ కర్ణకంటి స్వప్నవెంకటేష్, ఎస్సై వినయ్‌కుమార్, డాక్టర్ రవితేజ, జయరాజ్, శాగంటి మణి పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



చిల్పూరు: విద్యార్థులతో ఉపాధ్యాయులు



బచ్చన్నపేట: స్వయం పరిపాలనలో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు



పాలకుర్తి టౌన్: స్వయం పరిపాలన దినోత్సవంలో విద్యార్థులు



జనగామ రూరల్: ఓబుల్‌కేశవాపూర్‌లో..

చిల్పూరు: మండలంలోని మల్కాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఎంఈఓగా బోగం నిఖిల్, నోడల్ ఆఫీసర్‌గా భూక్య ప్రవీన్, హెచ్‌ఎంగా బూర విగ్నేష్ వ్యవహరించారు. హెచ్‌ఎం రవిబాబు, శ్రీదేవి, శోభారాణి, కళ్యాణి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

ఇటుకాలపల్లిలో..

బచ్చన్నపేట: ఇటుకాలపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించినట్లు హెచ్‌ఎం వెంకటేశ్వర్లు తెలిపారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారన్నారు. హెచ్‌ఎంగా స్పందన, ఎంఈఓగా దర్శన్‌కుమార్, ఉపాధ్యాయులుగా గీతాంజలి, హుస్రత్, స్పందన, రిచిత, వైష్ణవి, భానుప్రసాద్, చరణ్, షాహిద్, అరవింద్, మాధవన్ వ్యవహరించారని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఎస్ఎంసీ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యాయులు నూకల ఎల్లారెడ్డి, మహేష్, రమకుమారి, రాధ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి బాధ్యతాయుతమైంది

పాలకుర్తి టౌన్: ఉపాధ్యాయ వృత్తి బాధ్యతయుతైమనదని, సమాజ రూపకల్పనలో ఉపాధ్యాయులు కీలకమని పాలకుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పాయం శోభారాణి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వయం పరిపానల దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా తొటి విద్యార్థులకు విద్యాభోదన చేశారు. హెచ్‌ఎంగా జీ ప్రవీణ, డీఈఓగా పి మహేందర్, ఆర్‌జేడిగా నికిత, కలెక్టర్‌గా బి నిఖిల్, డీఎస్ఈగా జి రిషిత, ఎంఈఓగా కె వంశీకృష్ణ, డిప్యూటీఈఓగా ఎస్ అంజనేయులు, పీడీగా జి ముఖేష్ వ్యహరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయలు ఓరుగంటి రమేష్, ఉప్పలయ్య, బలరాం, నరసింహమూర్తి, మాలతి, అశోక్ కుమార్, దీప, నాగయ్య, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ఓబుల్ కేశవాపూర్‌లో..

జనగామ రూరల్: మండలంలోని ఓబుల్‌కేశవాపూర్ ఎంపీపీఎస్‌లో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. హెచ్‌ఎం వీరాంజనీ తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలోని ఎంపీపీఎస్‌లో...

పట్టణంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు లయన్స్ క్లబ్ మిలీనియం జనగామ ఆధ్వర్యంలో పరీక్షా ప్యాడ్లు అందజేశారు. శ్రీరాం శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయురాలు సరిత, సతీష్, సుమన్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి బూత్ కమిటీలు కీలకం



దేవరుప్పుల: మాట్లాడుతున్న రాంమోహన్‌రెడ్డి

జనగామ: బీజేపీ బలోపేతానికి బూత్‌కమిటీలు కీలకంగా పనిచేసేలా పార్టీ శ్రేణులు పాటుపడాలని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, అభియాన్ ఇన్‌చార్జ్ శివరాజ్ యాదవ్ సూచించారు. మంగళవారం బీజేపీ జిల్లా పట్టణ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు వారణాసి పవన్‌శర్మ అధ్యక్షతన జరిగిన బూత్ స్వశక్తికరణ్ అభియాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా కార్నర్ మీటింగ్‌లు నిర్వహించుకునే క్రమంలో పట్టణంలో ఈ నెల 20 వరకూ బూత్ స్వశక్తి కరణ్ అభియాన్ నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని 43 బూత్ కమిటీలను పరిశీలించి వాటిని పటిష్టపరిచి శక్తికేంద్రాల వారిగా సమావేశం నిర్వహించి పది మందితో బూత్ కమిటీలతోపాటు పన్నా ప్రముఖ్‌లను గుర్తించాలన్నారు. ప్రతీ బూత్‌లో రాష్ట్రపతి ప్రసంగాన్ని వివరిస్తూ భవిష్యత్‌లో పార్టీ కార్యక్రమాలు బూత్ స్థాయిలో నిర్వహించేందుకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. పార్టీ ఓబీసీ జిల్లా అధ్యక్షుడు గుజ్జులనారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శులు సంపత్ సందీప్ కాసుల శ్రీను, పెద్దోజు జగదీష్, కోటి వినోద్, కార్తీక్. చంద్రయ్య, ఎస్సీమోర్చా పట్టణ అధ్యక్షుడు తోకల హరీష్ ,శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

బూత్ స్వశక్తికరణ్ అభియాన్‌తో పార్టీ విస్తరణ

దేవరుప్పుల: బూత్ స్వశక్తికరణ్ అభియాన్ విధానంతో పార్టీ విస్తృతంగా విస్తరించేలా పాటుపడాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు లేగ రాంమోహన్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బూత్ స్వశక్తికరణ్ అభియాన్‌లో భాగంగా బూత్ స్థాయిలో పార్టీ పటిష్టం చేయడానికి శక్తి కేంద్ర ఇన్‌చార్జ్, సహ ఇన్‌చార్జ్‌లతో సమీక్ష నిర్వహించారు. ఊరూరా బూత్ కమిటీల ఏర్పాట్లపై దృష్టిసారిస్తూ మోదీ సర్కార్ ఫలాలు, రాష్ట్రపతి ప్రసంగాన్ని ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు బాగాల నవీన్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి చింత సృజన్, తిరుపతి నాయక్, ఉప్పల్ రెడ్డి, కాసాని సత్తయ్య, భాస్కర్, భాస్కర్, ఉప్పలయ్య, గణేష్, నర్సింహాచారి, ఆయా గ్రామాల బూత్ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి



పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న ఎంపీపీ జ్యోతి

కొడకండ్ల: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్‌తో పాటు సిబ్బంది సమయ పాలన పాటిస్తూ ప్రజలకు వైద్య సేవలందించాలని ఎంపీపీ ధరావత్ జ్యోతి సూచించారు. ఈజీఎస్ రాష్ట్ర డైరెక్టర్ అందె యాకయ్యతో కలిసి ఆమె మంగళవారం మధ్యాహ్నం పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాజరు రిజిస్టర్‌ను ఆమె పరిశీలించారు. ఓపీ సమయానికనుగుణంగా డాక్టర్, సిబ్బంది హాజరై అంకితభావంతో సేవలందించాలన్నారు. సమయపాలన పాటించకున్నా, నైట్ డ్యూటీలను విస్మరిస్తే చర్యలు తప్పవని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఊపేక్షించబోమని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మిట్టపల్లి వీరసోములు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



మాట్లాడుతున్న పర్శరాములుగౌడ్

బచ్చన్నపేట: బాల్యవివాహాలను అరికట్టాలని బసిరెడ్డిపల్లి సర్పంచ్ బాలగోని పర్శరాములు గౌడ్ అన్నారు. మంగళవారం జీపీ కార్యాలయంలో ప్రగతి సేవా సమితి, చైల్డ్ లైన్–1098 ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా అందరూ మారాలని చెప్పారు. గ్రామ స్థాయిలో బాలల రక్షణ కమిటీలు బాల్య వివాహాలను అరికట్టేందుకు సమష్టిగా కృషి చేయాలన్నారు. బాల్య వివాహాల నివారణకు 1098కు ఫోన్ చేయాలన్నారు. బాలల పరిరక్షణ విభాగం ఔట్రిచ్ వర్కర్ రంజిత్‌కుమార్, పాఠశాల హెచ్‌ఎం స్నేహలత, అంగన్‌వాడీ టీచర్ వనజ, ఆశా వర్కర్, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం



బహుమతులు అందుకున్న విద్యార్థులతో టీచర్లు

జఫర్‌గఢ్: కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు నేషనల్ మీన్స్‌కం మెరిట్ స్కాలర్షిప్‌నకు ఎంపికయ్యారు. కాగా, వీరి ఎంపిక పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ప్రజా వికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బహుమతుల ప్రదానోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు ఇల్లందుల రాజేందర్ విద్యార్థులు తోకల కేజీయ, వేముల స్రవంతి, గన్నారపు లిఖితప్రియ, ఇల్లందుల నైతికకు బహుమతులతో పాటు ఒక్కో విద్యార్థికి రూ.500 నగదును అందజేశారు. హెచ్‌ఎం ఎండి పర్వేజ్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, రవి, రమేష్‌బాబు, చంద్రమోహన్, ప్రభాకర్, స్వరూప, రాణి, రాజేందర్, లత, వేణుగోపాల్ పాల్గొన్నారు.

స్వయం పరిపాలనతో సృజనాత్మకత పెంపు



డీఈఓ రామును సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

కొడకండ్ల: స్వయం పరిపాలనతో విద్యార్థుల్లో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని డీఈఓ రాము అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలను డీఈఓ ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి విద్యా బోధన చేయగా డీఈఓ పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేసి విద్యార్థులను అభినందించారు. అలాగే కార్యక్రమానికి హాజరైన ఎంపీపీ జ్యోతి, ఈజీఎస్ రాష్ట్ర డైరెక్టర్ అందె యాకయ్య కూడా విద్యార్థులను అభినందించారు. డీఈఓ రాము పుట్టినరోజు కావడంతో వారు సన్మానించారు. సర్పంచ్ మధుసూదన్, మండల నోడల్ ఆఫీసర్ గ్రేస్‌కేజీయారాణి, హెచ్‌ఎం ప్రభాకర్, సిబ్బంది కుసుమ రాజు, గడ్డం కవిత, ఎస్ఎంసీ చైర్మన్ యాకయ్య, సీఆర్పీలు జ్ఞానానందం, అనీల్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

పాలకుర్తి టౌన్: పదో తరగతి విద్యార్థులు కష్టపడిచదవి ప్రతిభ కనబర్చి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కలలను నిజయం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి కె.రాము అన్నారు. మంగళవారం మండలంలోని విస్నూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 23 మంది 10వ తరగతి విద్యార్థులకు మహాత్మా హెల్పింగ్ హాండ్స్ వ్యవస్థాపకుడు గంట రవీందర్‌తో కలిసి పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి యాకయ్య, హెచ్‌ఎం ఏ వెంకటేశ్వర్లు, సర్పంచ్ యాకయ్య, ఎంపీటసీ మాటూరి యాకయ్య,ఉపసర్పంచ్ నలిని సోమేశ్వర్‌రావు, చెన్నూరు పాఠశాల హెచ్‌ఎం పోతుగంటి నర్సయ్య పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు లేకుండా చూడాలి

బచ్చన్నపేట: గ్రామాల్లో సమస్యలు లేకుండా చూడాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని సాల్వాపూర్‌లో పల్లె ప్రగతి పనులను పరిశీలించిన అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో జీపీ రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటి, నల్లా పన్నులను వసూలు చేయాలని, వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని తాగు నీటి సమస్య లేకుండా చూడాలన్నారు. నర్సరీల్లో పైకప్పుగా గ్రీన్ గార్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామ సర్పంచ్ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి మధు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.